## క్లుప్తంగా

### విరివిగా బ్యాంకు రుణాలు



మాట్లాడుతున్న రవిబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు, వ్యాపారులకు విరివిగా రుణాలను అందజేస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రవిబాబు తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా సొసైటీలో పలు రకాల రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. రుణాలను తీసుకున్న రైతులు, వ్యాపారులు సకాలంలో చెల్లించి, వడ్డీ రాయితీ పొందాలన్నారు. సభ్యుల ఈకేవైసీని త్వరతగతిన పూర్తి చేయాలని, వాయిదా పడిన రుణాలను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసమావేశంలో 2023–24 ఆడిట్ రిపోర్ట్సు నివేదికలు పరిశీలన, ఆమోదించడంపై చర్చించారు. సీఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### చెత్త బుట్టల పంపిణీ



కారణిలో చెత్తబుట్టల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, కారణి, నెరిణికండ్రిగ, కంచనపుత్తూరు గ్రామస్తులకు సోమవారం గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఉన్న సంపద తయారీ కేంద్రాలను శుభ్రం చేసి ప్రారంభించామన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచడానికి ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలతో జ్వరాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్మమ్మ, స్వప్న, వెంకటమ్మ, చంద్రయ్య, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

### సమయానికి రండి సారూ...



ఖాళీగా దర్శనమిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ గ్రీవెన్స్ డే సోమవారం ఉదయం 11 గంటలకు వరకు విధులకు హాజరు కాలేదు. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమస్యల ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. అయినీ ట్రాన్స్‌కో ఏఈ సమయపాలన పాటించడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌కో ఏఈ సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### లైసెన్స్ తప్పనిసరి




ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: వాహనదారులంతా తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు సేఫ్టీ అవేర్‌నేస్‌లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, 18 సంవత్సరాలు పైబడిన వారే వాహనాలను నడపాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయడం నేరమన్నారు. విద్యార్థులు రోడ్డుకు ఎడమవైపు నడవాలని, రోడ్డుపై నడిచేటప్పుడు జాగ్రత్త వహించాలని తెలిపారు. ప్రజా ప్రగతి ట్రస్టు కో–ఆర్డినేటర్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు: మండలంలోని గ్రామాల్లో అక్టోబరు 2వ తేదీన జరిగే ఉపాధిహామీ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభల్లో గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులను గుర్తించాలని సూచించారు. గుర్తించిన పనులకు గ్రామసభ తీర్మానాలను పొందాలన్నారు. బుధవారం ప్రతి పంచాయతీలో సంబంధిత అధికారులు గ్రామసభలు విధిగా నిర్వహించాలని ఆదేశించారు.

# మేత..రోత

- తుక్కును తినలేకపోతున్న పశువులు
- ముక్కంటి ఆలయ సిబ్బంది ప్రయోగాలు



గోవులకు మేతగా వేస్తున్న పచ్చగడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులకు ఎప్పుడూ ఏ ఆలోచన వస్తుందో తెలియడం లేదు. ఏదైనా ఆలోచన వచ్చిందే ఆలస్యం అమలు చేస్తున్నారు. దాని వల్ల ఫలితం ఉంటుందా ? ఉండదా ? అనే విషయాన్ని మాత్రం ఆలోచించడం లేదు. ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలోని గోవులకు హైబ్రిడ్ పచ్చగడ్డి సరఫరా జరిగేది. భక్తులు రూ.20 చొప్పున కొనుగోలు చేసి గోవులకు స్వయంగా తినిపించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే అధికారులు, సిబ్బంది ఎవరు ఆలోచన చేశారో తెలియదు కానీ సోమవారం పచ్చగడ్డిని యంత్రంతో తుక్కు చేసి సరఫరా చేశారు. ఆ మేతను తినడానికి గోవులు సహకరించడం లేదు. ప్లాస్టిక్ బుట్ట నిండుగా రూ.100, అరబుట్ట రూ.50 చొప్పున అమ్ముతున్నారు. హైబ్రిడ్ పచ్చగడ్డిని గోవులు తిని కండెలను మాత్రం విడిచిపెట్టేది. కానీ కండెలతో కలిసి తుక్కు చేసి అందిస్తున్నారు. దీంతో గోవులు తినడం లేనందున ఈ విషయం ఇన్‌చార్జ్ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌కు తెలిసి జరిగిందా ? తెలియక జరిగిందా ? అని తెలియడం లేదు. ఈఓ విచారణ జరిపి ఇలాంటి ప్రయోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని గోవులకు తిరిగి పచ్చగడ్డి కట్టలను సరఫరా చేయాల్సి ఉంది.

### మహిళా సాధికారతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయూ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.శ్రీలత మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాల, సమాజంలో ఎలా ప్రవర్తించాలో వివరించారు. కళాశాలలో ఉన్న కమిటీల వివరాలను తెలిపారు. యువతులు ఎదుర్కొనే సమస్యలపై ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పురోభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ



డీవైఈఓ బాలాజీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు: ప్రతి విద్యార్థి పురోభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తిరుపతి డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని పల్లం హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు డీవైఈఓను శాలువలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్, వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, మదన్ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రదోష పూజలు



ఆలయంలో పళ్లికొండేశ్వరస్వామి ఊరేగింపు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలోని శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆలయంలోని నందీశ్వర స్వామికి, శ్రీవాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు, తిరువళ్లూరుకు చెందిన శేఖర్, కుటుంబ సభ్యులు ఉభదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి లత, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

**ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు**

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ



ఆలయంలో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ జరిగింది. ఆలయంలో దీపారాధన అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం ప్రదోష నందిసేవ ఆలయ ప్రాకారంలో చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న మ్యాంగో రిసార్ట్ మేనేజర్ వై. శ్రీనివాసరావు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే టూరిజం హాస్పిటాలిటీ రంగంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్ అవార్డును సొంతం చేసుకుంది. ఇక్కడ అమలుచేస్తున్న స్థిరమైన ఆతిథ్య సేవలకు గానూ గుర్తింపు లభించినట్లు రిసార్ట్ యాజమాన్యం పేర్కొంది. ఏపీ ప్రభుత్వ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, సంస్కృతిక కార్యదర్శి వినయ్‌చంద్, ఏపీ టూరిజం అథారిటీ సీఈఓ అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అవార్డును స్వీకరించారు. శ్రీసిటీలోని సుందర సువిశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్‌లో అన్ని రకాల అత్యాధునిక వసతులు కలిగి ఉంది. ఇక్కడ బసచేసే అతిథులు మంచి ప్రకృతిని వీక్షించడంతో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పక్షులను వీక్షించడం వంటి వివిధ రకాల ప్రత్యేకతలను ఆస్వాదించవచ్చు. ఇక్కడ గ్లోబల్ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా రూపొందించబడిన పలు రకాల అంతర్జాతీయ వంటకాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

## శాస్త్రీయ విద్యాసాధన కోసం పోరాడుదాం




మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

శ్రీకాళహస్తి: విద్యార్థులు శాస్త్రీ విద్యాసాధనపై పోరాటం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దిశగా ముందుకు పోతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలో వస్తే సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని చెప్పారని.. ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించకుండా తిరుపతి లడ్డూ వ్యవహారంతో రాజకీయాలు చేస్తోందన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల సీట్లు ఇవ్వవద్దు అని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12 మెడికల్ కళాశాలలో అభివృద్ధి చేసి దళిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్శిటీకి రూ.100కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాకీర్, ఉపాధ్యక్షుడిగా నరేంద్ర, కార్యదర్శిగా లోకేష్, సహాయ కార్యదర్శిగా మణి, కోశాధికారిగా రిజ్వాన్, సభ్యులను ఎన్నుకున్నారు.

### ఇరిగేషన్ డీఈగా రత్నాకర్‌రెడ్డి



సత్యవేడు: ఇరిగేషన్ కార్యాలయం డీఈగా పీఎస్ రత్నాకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పిచ్చాటూరులో డీఈగా పనిచేస్తూ బదిలీపై సత్యవేడు వచ్చారు. ఇక్కడ డీఈగా పనిచేస్తున్న ఆదినారాయణనాయుడు శ్రీకాళహస్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువులు, కాలువలు పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### సత్యవేడు ఏపీఎంగా డాంగే యాదవ్



సత్యవేడు: వెలుగు కార్యాలయం ఏపీఎంగా డాక్టర్ పి.డాంగేయాదవ్ బాధ్యతలు చేపట్టారు. తిరుపతి నుంచి బదిలీపై ఆయన సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం స్వర్ణలత చిన్నగొట్టిగల్లుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య మహిళలు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

### ప్రభుత్వ పాఠశాలలకు డస్ట్ బిన్‌ల పంపిణీ

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మాండెలెజ్ పరిశ్రమ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలకు సోమవారం సుమారు రూ. లక్ష విలువైన డస్ట్ బిన్‌లను పింపిణీ చేసింది. విద్యార్థులకు పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాండెలెజ్ హెచ్‌ఆర్ మేనేజర్ రవళి, శ్రీసిటీ సీఎస్ఆర్ మేనేజర్ నిరీషా సన్నారెడ్డి, మాండెలెజ్‌కు చెందిన వెంకన్న అమన్, ఇరుగుళం హైస్కూల్ హెచ్‌ఎం మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు



అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు చూపుతున్న పోలీసులు

నాగలాపురం: అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను సోమవారం అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ వివరాలను సీఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. రెండు నెలల క్రితం నాగలాపురం మండలం, వడ్డిపాళెం, పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగలో మహిళల మెడలో నుంచి బంగారు చైన్ లాక్కెళ్లిన కేసుల్లో తమిళనాడుకు చెందిన సూర్యను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం విజయపురం మండలం, పన్నూరు సబ్ స్టేషన్ వద్ద సూర్య అరెస్టు చేసి అతని వద్ద నుంచి 42 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భాస్కర్ నాయక్ తెలిపారు. నిందితుడిపై 20 చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ నరేష్, ఏకాంబరం, మునియ్యా, ఈశ్వర్, పాండియన్ పాల్గొన్నారు.

### పౌరహక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్ఐ సురేష్

సత్యవేడు: మండల పరిధిలోని ఏఎంపురం గ్రామంలో సోమవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం ఆర్ఐ సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలు గొడవలు చేసుకోకుండా అందరూ అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉండాలన్నారు. గ్రామాల్లో గొడవలు చేసుకుని కేసులు పెట్టుకోవద్దన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామాల్లో బెల్టు షాపులు నడపరాదని హెచ్చరించారు. గ్రామంలో పిల్లల్ని పనికి పంపకుండా చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మార్కండేయ, సెక్రటరీ యుగంధర్, గ్రామస్తులు శ్రీనివాసులురెడ్డి, ఢిల్లీబాబు యాదవ్, చిరంజీవి, నాగభూషణం, పెరుమాళ్, సాయిబాబా, ఉదయకుమార్, చలపతి, నాగయ్య, చెల్లయ్య పాల్గొన్నారు.

## రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనులు చేపట్టాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీ పనుల్లో కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కొలతలను ఇచ్చి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ఆమందూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులు చేయాలని సూచించారు. పనుల వద్ద రెండు పూటలు కూలీల ఫొటోలను ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. పనుల్లో నాణ్యతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు చంద్రశేఖర్‌రాజు, దేవరి, కూలీలు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ ఉండాలా.. రూ.20వేలు ఇవ్వండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీగార్డుగా కొనసాగాలంటే రూ.20 వేలు ఇవ్వాలని సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్యామ్ డిమాండ్ చేసినట్లు ఆలయ సెక్యూరిటీగార్డు శేషయ్య ఆరోపించారు. తనను మరో పదిమందిని అన్యాయంగా నిలిపేశారని, 2008 నుంచి కారు పార్కింగ్‌లో పనిచేశానని, అనంతరం 2019లో ఆలయ సెక్యూరిటీగార్డుగా చేరానని అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సెక్యూరిటీ విధానం మారిందని రూ.20 వేలు ఇస్తేనే తీసుకుంటామని సూపరింటెండెంట్ బెదిరించినట్లు శేషయ్య తెలిపారు. అంతే కాకుండా ఆలయంలో డబ్బులు వచ్చే ప్రాంతాల్లో డ్యూటీ ఇస్తే సాయంత్రానికి ఎంతో కొంత చెల్లించాల్సి ఉందన్నారు. ఎలాంటి తప్పు చేయని మమ్మల్ని తొలగించడం బాధ కలిగించిందన్నారు. మీరు వైఎస్సార్ సీపీ వారని రూ.20 వేలు ఇస్తేనే చేర్చుకుంటామని బెదిరిస్తున్నారన్నారు. కొందరు డబ్బులు చెల్లించి కొనసాగుతున్నారని, వారు బయటకు చెబితే ఉద్యోగం పోతోందనే భయం చెప్పడంలేదని అన్నారు. ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం ఎంఈఓ రవీంద్రనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఐకేపీ ఏపీఎం మున్నెయ్య, ఏపీఓ భానుప్రియ, ఏఓ భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్పలతో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని, వర్షాకాలం మొదలు అవుతుండడంతో దోమలు చేరకుండా చూడాలని తెలిపారు. పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పనిని చూపించాలన్నారు. మహిళ సమాఖ్య సభ్యులకు సకాలంలో బ్యాంకు నుండి రుణాలను ఇప్పించాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు లేకుండా బోరు మోటారు, పైపులైన్లు, చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో బాలింతలకు, గర్భవతులకు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్టు తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం రండి కార్యక్రమంలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీమురళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్ ఫోన్ మోజులో, సామాజిక మాధ్యమాల ముసుగులో ఉత్తరాల ప్రాధాన్యతను విద్యార్థులు మరచిపోయారని తెలిపారు. ప్రముఖ రచయిత చొక్కాపు వెంకటరమణ 75వ పుట్టిన రోజు సందర్భంగా ఉత్తరాలు రాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాదెండ్ల మురళి, సురేష్‌బాబు, వేణుగోపాల్, ప్రసాద్, మాధవీలత, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చాలీచాలని మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు నాగార్జున

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు చాలీచాలని మధ్యాహ్న భోజనం పెడుతున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకుడు నాగార్జున, ఎస్ఎఫ్ఐ నాయకుడు మురళి అన్నారు. సోమవారం వారు బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీని పరిశీలించారు. పాఠశాలలో మెనూ పాటించడం లేదని, విద్యార్థులకు తిన్నంత భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. ఐదుగురు పిల్లలకు గుడ్లు, అన్నం లేదని తెలిపారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలిని వివరణ కోరగా ఆమె సమాధానం చెప్పలేదని అన్నారు. ఎంఈఓ, ఎంపీడీఓలకు పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలు తెలిపామన్నారు. పిల్లల కడుపు మాడ్చుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## దాసుకుప్పం హెచ్‌ఎం జ్యోతిపై విచారణ కమిటీ



విచారణ నిర్వహిస్తున్న ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప

సత్యవేడు: దాసుకుప్పం జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ముగ్గురు అధికారుల బృందం విచారణ చేపట్టింది. సోమవారం పాఠశాలలో విచారణ చేపట్టేందుకు ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప, పీలేరు ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి, వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరణానవనీతం బృందం విచారణ చేపట్టింది. హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట కార్మికులు, గ్రామస్తులను విచారించారు. రాత పూర్వకంగా అందరి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, రేషన్ డీలర్ రాజ్యలక్ష్మీ, వంట కార్మికులు లీలావతి, సుశీల, గ్రామస్తులు లోకయ్యారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.